లీకేజీలతో తాగునీటి వృథా

నల్లబెల్లి : మండల కేంద్రంలో నీటి సరఫరా లీకేజీల మయంగా మారింది. లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన పైపులైన్‌లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో నీరు కలుషితం అవడంతోపాటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

తరచూ లీకేజీలు..

మండల కేంద్రంలోని ప్రజల తాగునీటి అవసరాలు తొలగించేందుకు శాశ్వత ప్రతిపాదికన మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఇటీవల మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చారు. కాగా మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై ఏర్పాటు చేసి గేట్‌వాల్వ్‌కు లీకేజీ ఏర్పడడం, పైపుల నాణ్యత లోపంతో లెంకాలపల్లి క్రాస్ రోడ్డు, కాసీంపుర కాలనీలలో పైపులైన్ లీకేజీలు ఏర్పడి తాగునీరు వృథాపోతూ సమీపంలోని మురుగు గుంతలు ఏర్పడడంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. లీకేజీల నివారణలకు అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


గేట్‌వాల్వ్ లీకేజీతో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు


నీటి లీకేజీతో ఏర్పడిన బురదగుంత

లీకేజీలను సవరించాలి



ప్రధాన రోడ్డుపై ఏర్పాటు చేసిన గేట్‌వాల్వ్‌తో పాటు లెంకాలపల్లి క్రాస్ రోడ్డు, కాసీంపుర కాలనీలో తరచుగా పైపులైన్‌లు లీకేజీ అవుతున్నాయి. తాగునీరు వృదాగా పోతోంది. లీకేజీలను ఎప్పటికప్పుడు గుర్తించి సవరించాలి.

-పప్పు మొగిలి, నల్లబెల్లి

చర్యలు తీసుకుంటాం



లీకేజీలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కొన్ని చోట్ల మరమ్మతులు చేపట్టాం. వేసవిలో ఇబ్బందులు లేకుండా మంచినీటి సరఫరా చేపడుతున్నాం. గేట్‌వాల్వ్, పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతు చేపడుతాం.

-కూచన ప్రకాశ్, ఎంపీఓ, నల్లబెల్లి

రైతుల పక్షాన పోరాడుతాం


నిరసన తెలుపుతున్న డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్, నాయకులు

వర్ధన్నపేట : బోనస్, ఇతర హామీల అమలు కోసం రైతుల పక్షాన పోరాడతామని బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్, ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి తెలిపారు. బోనస్ రూ.500 తోపాటు మద్దతు ధర, ఇతర సమస్యలపై ఆ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రైతులకు భరోసా కల్పించే దిశగా నిరసనలు కొనసాగుతాయని చెప్పారు. లోకసభ ఎన్నికలు ముగియగానే ధాన్యంపై బోనస్ పెంచుతామని ప్రకటించిన ప్రభుత్వం మాట మార్చిందని మండిపడ్డారు. రాష్ట్రంలోని 80 శాతం మంది రైతులు దొడ్డు వడ్లనే పండిస్తున్న క్రమంలో సన్నాలకే బోనస్ ఇస్తామని ప్రకటించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు సిలువేరు కుమారస్వామి, తూళ్ల కుమారస్వామి, గుజ్జ గోపాల్‌రావు, గుజ్జ సంపత్‌రెడ్డి, ఎలేందర్‌రెడ్డి, ఎండీ రహీం, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

త్వరలో తాగునీటి సమస్యకు పరిష్కారం



గీసుకొండ : త్వరలోనే మండలంలోని జాన్‌పాక వాసులకు తాగునీటి సమస్య పరిష్కారం కానుందని కార్పొరేటర్ సుంకరి మనీషా శివకుమార్ తెలిపారు. జాన్‌పాక పరిధిలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు పనులను కాంట్రాక్టర్ గురువారం మొదలుపెట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడారు. గతంలో పైప్‌లైన్ ఏర్పాటు కోసం మున్సిపాల్టీ నుంచి రూ.72 లక్షల నిధులు కేటాయించగా పలు కారణాలతో పనులు ప్రారంభించలేదని చెప్పారు. పనులు మొదలైన క్రమంలో త్వరలో సమస్య తీరనుందని ధీమా వ్యక్తం చేశారు.

దొరికిన పర్సు అప్పగింత



దుగ్గొండి : ప్రయాణికురాలు మర్చిపోయిన పర్సును ఆటోడ్రైవర్ పోలీసులకు అప్పగించి ఔదార్యం చాటిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని తిమ్మంపేటకు చెందిన ఆటోడ్రైవర్ దండు రాజు గ్రామం నుంచి నర్సంపేటకు ఆటోలో ప్రయాణికులను తీసుకెళ్తుండగా లక్నెపల్లి వద్ద దిగిన ఓ మహిళ పర్సును మర్చిపోయి ఆటో దిగి వెళ్లిపోయింది. మార్గమధ్యలో గమనించిన ఆటో డ్రైవర్ రాజు పర్సును నర్సంపేట పోలీసులకు అప్పగించారు. పర్సులో రూ.8 వేల నగదు ఉండడాన్ని గమనించిన పోలీసులు రాజును అభినందించారు. కార్యక్రమంలో రవి, ధినేశ్, తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీకి గాయం

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటలోని ఊరచెరువు వద్ద చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో పని చేస్తుండగా అమృతండా పరిధిలోని ఎర్రగడ్డ తండాకు చెందిన కూలీ భూక్య స్రవంతి ప్రమాదవశాత్తు గడ్డపార తగిలి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. తోటి కూలీలు ఆమెను చికిత్స కోసం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి ఎంజీఎం ఆస్పత్రికి పంపించగా చికిత్స పొందుతోంది.

నివాళి



నర్సంపేట : పట్టణానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు మొగిలి నర్సయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్, ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మెరుగు సాంబయ్య, పట్టణ అధ్యక్షుడు పోతరబోయిన చంద్రమౌళి, పార్టీ పట్టణ కార్యదర్శి నాడెం నాగేశ్వర్, ప్రచార కార్యదర్శి జన్ను మురళి తదితరులు నివాళులర్పించారు. అలాగే పట్టణానికి చెందిన చదలవాడ ముకుందరావు సతీమణి లక్ష్మీప్రసూనాంబ సైతం గురువారం మృతి చెందగా ఆమె మృతదేహానికి, నర్సయ్య మృతదేహానికి స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాళులర్పించి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

ఆర్థికసాయం



నర్సంపేట రూరల్ : నర్సంపేట మడలంలోని ముగ్దుంపురం గ్రామానికి చెందిన బాదావత్ రాజేందర్ అనారోగ్యంతో బుధవారం సాయంత్రం మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆ తండా పెద్ద మనిషి చాందావత్ వెంకట్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ చాందావత్ తిరుపతినాయక్, ఉపాధ్యాయుడు ఈర్య, సొసైటీ డైరెక్టర్ ఇస్లావత్ గోపీనాయక్, బంజార కమ్యూనిటీ ఆధ్వర్యంలో గురువారం రూ.30 వేల నగదుతోపాటు 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు.

కొమ్మాలలో..

గీసుకొండ : మండలంలోని కొమ్మాలలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఈర్ల ప్రవీణ్ సోదరుడు నరేశ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆ పార్టీ నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.5 వేల సాయం చేశారు. బాలకిశోర్‌రెడ్డి పంపిన నగదును ఆ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నరేశ్ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము శ్రీకాంత్, జన్ను రమేశ్, నాగారపు స్వామి, మేకల రాజ్‌కుమార్, దాడి శివ, ఆరకట్ల సాయి, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

- అభయాంజనేయస్వామికి వెండి మకర తోరణం బహూకరణ


వెండి మకర తోరణం బహూకరిస్తున్న దాతలు

నర్సంపేట: నర్సంపేట పట్టణం ద్వారకపేటలోని వేణుగోపాల వెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో ఆలయ చైర్మన్ గంధం నరేందర్‌గుప్తా ఆధ్వర్యంలో గురువారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. అర్చకులు ఆరుట్ల వెంకటాచార్యులు బృందం పర్యవేక్షణలో గురువారం ఉదయం తెల్లవారు జామున 5గంటలకు సుప్రభాత సేవతో ఉత్సవాలను ప్రారంభించారు. అలివేలుమంగ పద్మావతి సహిత వేంకటేశ్వరస్వామి విగ్రహాలకు పుష్పాలంకరణతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్నె సర్వేశంచంద్రకళ, పుట్ట సాంబమూర్తినిర్మల, పుచ్చకాయల వెంకట్‌రెడ్డికవిత అభయాంజనేయ స్వామికి నాలుగు కేజీల వెండి మకరతోరణం బహూకరించారు. అనంతరం స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్.. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గంధం నరేందర్‌గుప్తా, బూరుగు సాంబయ్య గౌడ్, మోతె నరేందర్‌రెడ్డి, గన్నోజు భాస్కరాచార్యులు, నంద్యాల సురేష్‌రెడ్డి, పాపని వేణు, గోపగాని వెంకటేశ్వర్లు, కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్మానం



గీసుకొండ : కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ప్రముఖ సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డిని ఆయన స్వగ్రామమైన మనుగొండలో మచ్చాపురం గ్రామానికి చెందిన యాదవ సంఘం నాయకులు గురువారం శాలువా కప్పి సన్మానించారు. రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు అండగా నిలుస్తున్నాడంటూ అభినందించారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం అధ్యక్షుడు మర్రి రాజలింగం, నాయకులు కుమారస్వామి, కుంట రమేశ్, వేల్పుల సురేశ్, కోటి ,రాజు, ఐలేందర్, ప్రభాకర్, మధూకర్, కుమారస్వామి, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

‘ఎమ్మెల్సీ’ గెలుపునకు కృషి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న సీతారాంనాయక్

నర్సంపేట : బీజేపీ వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీ నియోజకవర్గ అభ్యర్థిగా బరిలో నిలిచిన గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని శ్రేణులను ఆ పార్టీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ కోరారు. పట్టణంలో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో తన గెలుపునకు శ్రేణులు అవిశ్రాంతంగా పాటుపడ్డారంటూ కృతజ్ఞతలు తలెఇపారు. ఈనెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రేమేందర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. సమావేశంలో ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్యే కంటెస్టెడ్ అభ్యర్థి డాక్టర్ కంభంపాటి పుల్లారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, పార్లమెంటు కోకన్వీనర్ రామచందర్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా కోకన్వీనర్ పృధ్వీరాజ్, పట్టణ అధ్యక్షుడు రాంబాబు, సీనియర్ నాయకుడు సత్యనారాయణగౌడ్, మండల అధ్యక్షుడు రాజేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

‘బిట్స్’లో ప్రాంగణ నియామకాలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కాలేజీ నాన్ ఐటీ ఆధ్వర్యంలో మూడ్రోజులపాటు తలపెట్టిన ప్రాంగణ నియామకాలు గురువారం మొదలయ్యాయి. ఈ సందర్భంగా ఏజేపీ కన్సల్టింగ్ సర్వీస్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ ట్రైనర్స్ ఉద్యోగాల కోసం, ఎంపవర్‌మెంట్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రొడక్షన్ ఇంజనీర్ ఉద్యోగాలకు, ట్రెండ్జ్ కంపెనీ ఆధ్వర్యంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూ నిర్వహించారు. రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, హెచ్‌ఆర్ రౌండ్‌లు నిర్వహించగా 31 మంది ఎంపికయ్యారు. వారిని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కళాశాల సెక్రెటరీ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ప్రాంగణ నియామకపు అధికారి సురేశ్, ట్రెనింగ్ అండ్ ప్లెస్‌మెంట్ ఆఫీసర్ ఫసీ అహ్మద్ ఫర్వేజ్, టెక్నికల్ ట్రైనర్ సాంబశివుడు, రణధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత


బీమా చెక్కును అందజేస్తున్న మేనేజర్ రవికిరణ్

పర్వతగిరి : మండలంలోని మోత్యతండాకు చెందిన బాదావత్ నరేశ్ కొంత కాలం క్రితం మృతి చెందగా మంజూరైన బీమా చెక్కును బాధిత కుటుంబానికి కెనరా బ్యాంక్ మేనేజర్ రవికిరణ్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ రవికిరణ్ మాట్లాడారు. నరేశ్‌కు అన్నారం షరీఫ్ గ్రామంలోని కెనరా బ్యాంకులో ఖాతా ఉండడంతోపాటు ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకంలో రూ.436 చెల్లించి ఇన్సూరెన్స్ తీసుకున్నట్టు తెలిపారు. ఈ క్రమంలోనే నరేశ్ మృతి చెందగా నామినీ అయిన నరేశ్ సతీమణి మమతకు రూ.2 లక్షల బీమా మంజూరైనట్టు చెప్పారు. బ్యాంకు ఖాతాదారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాలలో అతి తక్కువ ప్రీమియంతో చెల్లించి సభ్యులుగా చేరాలని సూచించారు. ఈ పథకాల్లో చేరిన వారు సహజ మరణం చెందితే జీవన్‌జ్యోతి పథకం కింద రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షలు బీమా కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. బ్యాంకు అకౌంట్ కలిగిన 18 నుంచి 70 ఏళ్ల వరకు వయస్సున్న ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ మహేశ్, క్లర్క్ తిరుపతి, సిబ్బంది రామస్వామి, రమాదేవి, వర్ధన్నపేట ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు కమలాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏ విడుదల చేయాలి

చెన్నారావుపేట : ఉద్యోగులకు పెండింగ్ డీఏ వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్-గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 18 జరగబోయే క్యాబినెట్ సమావేశంలో పెండింగ్‌లో డీఏ, ఒకేచోట మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న అన్ని క్యాడర్ల ఉద్యోగులకు బదిలీలు చేపట్టడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు.

మురుగునీటితో వెతలు.. పోలీసులకు ఫిర్యాదు

చెన్నారావుపేట : బాబోయ్ మురుగునీటితో వెతలు తప్పడం లేదని మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామస్తులు వాపోతున్నారు. ఈ క్రమంలో తాము పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ననుమాస కుమారస్వామి, మంచిక సాయికుమార్, రామగోని జయమ్మ, సుతారి సౌందర్య, కందుల దివ్య, మంచిక వసంత, ననుమాస రజిత విలేకరులకు గురువారం తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారిలోని చర్చి ఎదుట రోడ్డు పక్కనే ఉన్న ఇండ్ల ముందు నుంచి మరుగునీరు ప్రవహిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోయారు. చర్చి ఎదుట వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్న బూర వీరస్వామి వాటర్‌ప్లాంట్‌కు సంబంధించిన, ఇంటి వాడకపు నీటిని రోడ్డు మీదకే వదులుతున్నట్టు చెప్పారు. ఈ క్రమంలోనే నీరు నిలిచి దోమలు, ఈగలు ప్రబలి రోగాల బారిన పడుతున్నామని తెలిపారు. వాటర్‌ప్లాంట్ యజమానిని ప్రశ్నిస్తే అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడని వాపోయారు. వీరస్వామిపై చర్యలు తీసుకుని తమను మురుగునీటి దుర్గంధం నుంచి కాపాడాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి ఫీడర్ పరిధిలోని 33 కేవీ లైన్ మెంటెనెన్స్ పనులు జరుగుతున్న క్రమంలో నేడు (శుక్రవారం) ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ శ్రీధర్, ఏఈ జోగానంద్ గురువారం ప్రకటనలో తెలిపారు. 33/11 ఏవీ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

22న లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

దామెర : ఈనెల 22న మండలంలోని ఊరుగొండ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు తూపురాణి శ్రీనివాసచార్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం అన్నదానం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

‘హరితహారం’ చెట్లు అగ్నికి ఆహుతి


కుంటపల్లి వద్ద అగ్నికి అహుతవుతున్న చెట్లు

సంగెం : వేసవి కాలం వచ్చిందంటే చాలు.. మండలంలోని పలు గ్రామాల్లో హరితహారంలో భాగంగా గతంలో నాటి పెంచిన చెట్లకు ముప్పు తప్పడం లేదు. నానాటికీ తరిగిపోతున్న వన సంపదను పెంచి వానలు కురిసేలా లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి నాటి పెంచిన పచ్చని చెట్లు అగ్నికి ఆహుతి అవుతున్న దుస్థితి కనపడుతోంది. మండలంలో ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు భారీగా పెరిగాయి. కొన్ని చోట్ల విద్యుత్ తీగలు తగులుతుండడంతో ఆ శాఖ అధికారులు, సిబ్బంది వాటిని నరికి వేస్తున్నారు. ఈ క్రమంలో అవి మోడువారిపోతున్నాయి. మండలంలోని కుంటపల్లి, సంగెం, తిమ్మాపూర్, పల్లారుగూడ, నల్లబెల్లి, మొండ్రాయి, గవిచర్ల, తీగరాజుపల్లి, కాట్రపల్లి, ఆశాలపల్లి తదితర గ్రామాల్లో కొందరు రైతులు పంట పొలాల్లోని మొక్కజొన్న, వరి కొయ్యల వ్యర్థాలకు నిప్పు పెడుతుండగా మంటలు ఎగసిపడి గాలివాటానికి పక్కనే ఉన్న హరితహారంలో భాగంగా పెంచిన చెట్లకు అంటుకుని అవి కాలిబుడిద అవుతున్నాయి. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి రైతులకు అవగాహన కల్పించి విలువైన వృక్షసంపదను కాపాడాల్సిన అవసరం ఉందని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

వేడుకగా మరియ మాత ప్రదక్షిణ


భక్తులను ఆశీర్వదిస్తున్న ఫాదర్లు

చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయినిపహాడ్‌లో శతవత్సర గ్రామ నిర్మాణ జూబ్లీ వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి మరియ మాత స్వరూపంతో వేడుకగా పురవీధుల్లో ప్రదక్షిణ నిర్వహించారు. మహిళలు తమ ఇళ్లముందుకు రథం రాగానే నీళ్లు పోస్తూ కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పునీత రాయప్ప బోధన పీఠ ఆలయం చర్చి వద్ద విచారణ గురువు ఫాదర్ తుమ్మ యాగారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని కొవ్వొత్తులు వెలిగించి మరియ మాతకు సమర్పించారు. అనంతరం రాత్రి గ్రామ మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు. తదుపరి పునీత రాయప్ప నృత్యనాటక రూపకాన్ని ప్రదర్శించారు. గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

భక్తులతో సందడిగా మారిన ఆలయం

పునీత రాయప్ప బోధన పీఠ ఆలయం వద్ద సందడి నెలకొంది. గ్రామస్తులు, భక్తులు చర్చి వద్దకు తరలివచ్చి కొవ్వొత్తులను వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులను ఫాదర్ తుమ్మ యాగారెడ్డి, గురువులు ఆశీర్వదించారు.

చర్చికి రథం బహూకరణ

తిమ్మరాయిని పహాడ్ పునీత రాయప్ప బోధన పీఠ దేవాలయం చర్చికి గ్రామానికి చెందిన పుట్టి సుందర్ రాజ్.. రూ.6లక్షల విలువైన రథం బహూకరించారు. తన తల్లిదండ్రులు పుట్టి అర్లయ్య-అన్నమ్మ, తన భార్య పుట్టి అన్నమ్మ జ్ఞానకార్థం పుట్టి, సుందర్ రాజు, అతడి కుటుంబ సభ్యులు సామంత్ కు మార్, జయశ్రీ, నిహాల్, గుర్రం అభిలాష్, సౌమ్య, తేజస్వి, దేవాన్ష్.. రూ.6 లక్షల విలువైన రథం చర్చి ఫాదర్ తుమ్మ యాగారెడ్డికి బహూకరించారు.

ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డి గెలుపే ధ్యేయం

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపే ధ్యేయంగా పని చేయాలని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నియోజకవర్గంలోని మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువత, విద్యావంతులను ఆయన కోరారు. పట్టణంలో రాకేశ్‌రెడ్డితో కలిసి గురువారం నిర్వహించిన సమావేశంలో సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. సుదీర్ఘకాలం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి సాధించిన పార్టీగా బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో గుర్తింపు ఉందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో పదేళ్లపాటు సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టి తెలంగాణను సమగ్ర అభివృద్ధి చేశారని తెలిపారు. పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాలులో ఈనెల 22న సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న పట్టభద్రుల ఓటర్ల సమావేశానికి పార్టీ ప్రతినిధులు, ఓటర్లు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బ్యాలెట్ పేపర్‌లోని క్రమసంఖ్యలో మూడో నంబర్‌పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి రాకేశ్‌రెడ్డి గెలుపునకు బాటలు వేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు నామాల సత్యనారాయణ, నాగెల్లి వెంకటనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన


నిరసన తెలుపుతున్న వారితో మాట్లాడుతున్న ఎస్సై రఘుపతి

ఖానాపురం : తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని బుధరావుపేటకు చెందిన గీత కార్మికుడు రావుల వెంకన్న కుటుంబీకులు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. వివరాలిలా.. బుధరావుపేటకు చెందిన రావుల వెంకన్నను బుధవారం రాత్రి కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. ఈ క్రమంలో ప్రమాదానికి కారణమైన కారు యజమాని, ప్రయాణికులు తమకు న్యాయం చేయకుండా మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని వెంకన్న కుటుంబీకులు ఆరోపించారు. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికీ ఎలాంటి గాయాలు కాకున్నా వాళ్లు ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారని తెలిపారు. నిరసన చేస్తున్న వారితో ఎస్సై రఘుపతి మాట్లాడుతూ మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికీ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించామని, రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించామని వివరించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చి నిరసన విరమింపజేశారు.

బ్రహ్మోత్సవాలకు తరలిరావాలి

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో తలపెట్టిన శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి అధ్యయన బ్రహ్మోత్సవాలకు భక్తులు తరలిరావాలని అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి కోరారు. శనివారం సాయంత్రం ఉత్సవాలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. 23 వరకు కొనసాగుతాయని వివరించారు.

ఉచిత వైద్యశిబిరం



నెక్కొండ : మండలంలోని బేతెస్థ ప్రేయర్ ఫెలోషిప్ చర్చి ఆవరణలో నర్సంపేటకు చెందిన సాయిశ్రీ ఆస్పత్రి వైద్య బృందం గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించింది. సుమారు 100 మందికి షుగర్, బీపీ, న్యూరోపతి, సాధారణ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంచంద్ మాట్లాడారు. సమాజంలోని ప్రతీఒక్కరు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. తద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని చెప్పారు. ట్రూ గాస్పెల్ హీలింగ్ మినిస్ట్రీస్ సొసైటీ జనరల్ సెక్రటరీ మాలోతు శంకర్ మాట్లాడుతూ పేదలు వైద్యశిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు హిమవతి, రెవరెండ్ ఐజాక్, తదితరులు పాల్గొన్నారు.